డ్రగ్స్, మత్తు పదార్థాలపై అవగాహన

డ్రగ్స్, మత్తు పదార్థాలపై అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యులు

కామారెడ్డి, ఆగస్టు 26 : జిల్లా కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్‌లో కళా బృందం సభ్యులతో డ్రగ్స్, మత్తు పదార్థాలపై సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా షీటీం, సైబర్ క్రైమ్, రోడ్డు సేఫ్టీ, బాల్య వివాహాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. షీటీం నంబర్ 8712686094, సైబర్ నేరాల కోసం టోల్ ఫ్రీ నంబర్ 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో టోల్ ఫ్రీ నంబర్ 100, 108, 1930, 181ను ఉపయోగించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు, షీటీం, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుట్కాలు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తాం

మాచారెడ్డి, ఆగస్టు 26 : గ్రామాల్లో గుట్కాలు విక్రయిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై అనిల్ హెచ్చరించారు. మండలంలోని లచ్చాపేటలో కొవురి తిరుపతి కిరాణం షాపులో అక్రమంగా నిల్వ ఉంచిన గుట్కా ప్యాకెట్లను సోమవారం సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రభుత్వ లెక్చరర్ల బదిలీలు ఆపాలి

మాట్లాడుతున్న టీఎన్‌వీఎస్ నాయకులు

కామారెడ్డి, ఆగస్టు 26 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల లెక్చరర్ల బదిలీలను ఆపాలని టీఎన్‌వీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వారు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఫారెస్ట్రీ విభాగంలో లెక్చరర్‌గా బోధిస్తున్న సుచరణ్ బదిలీని ఆపాలని అన్నారు. కళాశాలలో సుమారు ఫారెస్ట్రీని అభ్యసిస్తున్న విద్యార్థులు 160కిపైగా ఉన్నారని, కొన్ని సంవత్సరాలుగా విద్యార్థులకు బోధిస్తున్నారని అన్నారు. అధ్యాపకురాలు సుచరణ్ బదిలీపై వెళ్తే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి బదిలీని ఆపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టీఎన్‌వీఎస్ జిల్లా అధ్యక్షుడు కొత్తీర్‌కార్ వినయ్ కుమార్, కార్యదర్శి సాయిరాం, శివ, సాయికిరణ్, అభిలాష్, శరవణ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

ఎల్లారెడ్డిలోని గోపాలస్వామి ఆలయంలో ఉట్టి కొడుతున్న చిన్నారులు

జంగంపల్లిలో పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

ఎల్లారెడ్డి రూరల్/లింగంపేట/గాంధారి/నాగిరెడ్డిపేట/బీబీపేట్/భిక్కనూరు, ఆగస్టు 26: జిల్లాలో సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే కృష్ణుడి ఆలయాల వద్ద భక్తులు బారులుతీరారు. ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు కొనసాగాయి. ఎల్లారెడ్డిని గోపాలస్వామి ఆలయంలో వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో గోకులాష్టమి వేడుకలను నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉట్టి కార్యక్రమం ఏర్పాటు చేయగా.. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. లింగంపేట లోని ఆయా వాడల్లో గోపాల కాల్వ ఏర్పాటు చేశారు. స్థానిక వేంకటేశ్వర కల్యాణ మండపంలో చిన్నారులకు గోపిక, కృష్ణుడి వేషధారణ పోటీలు నిర్వహించారు. గాంధారిలోని అంగడి బజార్‌లో ఉట్టికొట్టే వేడుకను ఘనంగా నిర్వహించారు. మండలం లోని గుర్జాల్, తిప్పారం, నేరల్, చద్మల్, నాగ్లూర్, బీర్మల్ తదితర మధుర లంబాడీల తండల్లో గోకులాష్టమిని పురస్కరించుకొని జెండాలను ఆవిష్కరించారు. నాగిరెడ్డిపేట మండలం మాల్తుమ్మెద గ్రామంలో కృష్ణయ్య, గోపిక వేషధారణలో చిన్నారులు అలరించారు. కృష్ణుడి విగ్రహాన్ని పల్లకీలో గ్రామ ప్రధాన వీధుల్లో ఊరేగించారు. చిన్నారులు దారి పొడుగునా నృత్యాలు చేశారు. బీబీపేట్‌తోపాటు మాందాపూర్, తుజాల్‌పూర్, యాడారం, మల్కాపూర్, కోనాపూర్ తదితర గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. భిక్కనూరు మండలం జంగంపల్లిలోని మురళి కృష్ణ మందిరంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో హోమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

మాట్లాడుతున్న తెలంగాణ కార్మికుల సంఘం నాయకులు

కామారెడ్డి, ఆగస్టు 26 : ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చాలని తెలంగాణ నూతన బీడీ కార్మికుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలైనా బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించలేదని అన్నారు. పింఛన్ పెంపు, బీడీ కార్మికులకు ఇంటి నిర్మాణం, పిల్లలకు స్కాలర్‌షిప్‌ను పెంచాలని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ నూతన బీడీ కార్మిక సంఘం కార్యదర్శి శివం సత్యం, సభ్యులు సిద్దిరాములు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే..

బిచ్కుంద, ఆగస్టు 26: మండలంలోని బిచ్కుంద –బాన్సువాడ ప్రధాన రహదారిలో పెద్ద దేవాడ గ్రామం వద్ద వాగుపై నిర్మించిన వంతెన పక్కన ఏర్పడిన గుంత ప్రమాద కరంగా మారింది. వర్షపు నీరు చేరడంతో గుంత మరింత పెద్దగా మారుతున్నది. ఈ రహదారి గుండా నిత్యం వందల సంఖ్యలో వాహన దారులు రాకపోకలు సాగిస్తుంటారు. ఎవరైనా గమనించక పోతే వాహన దారులు గుంతలో పడే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి గుంతను పూడ్చివేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

పల్లకీసేవలో పాల్గొన్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్

బాన్సువాడ రూరల్, ఆగస్టు 26 : బాన్సువాడ మండలం బోర్లం గ్రామంలో ఉన్న ఆదిబసవేశ్వర ఆలయంలో రాష్ట్ర వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. మఠాధిపతి సోమయప్ప తీర్థప్రసాదాలు అందజేశారు. నాయకులు కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహులు, శ్రీనివాస్, పర్వంరెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు. శ్రావణమాసం చివరి సోమవారం కావడంతో ఆదిబసవేశ్వర ఆలయం, బోర్లం క్యాంపు తండాలోని మొండి బసవేశ్వర ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ పెద్దలు బాపురెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కాశీరాం, సాయిరాం, శ్రీనివాస్‌రెడ్డి, సుభాష్, శ్రీశైలం, ఆనంద్, విష్ణువర్ధన్, నాగేష్, ఆంజనేయులు, వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పోచారాన్ని కలిసిన మీటర్ రీడింగ్ కార్మికులు

బాన్సువాడ, ఆగస్టు 26 : పట్టణంలో వ్యవసాయశాఖ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డిని కరెంట్ మీటర్ రీడింగ్ కార్మికులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రీడింగ్ కార్మికుల సమస్యలను ఎమ్మెల్యే పోచారానికి వివరించారు. తమకు 30 రోజులపాటు పనికల్పించి, ఆర్టిజన్‌గా గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరారు. తాము కరోనా సమయంలో కూడా ప్రాణాలు పణంగా పెట్టి ప్రభుత్వానికి పనిచేశామని తెలిపారు. కార్యక్రమంలో చందు తోపాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

ఆపరేటర్ల నూతన కార్యవర్గం

మాచారెడ్డి, ఆగస్టు 26 : విద్యుత్ సబ్‌స్టేషన్ ఆపరేటర్ల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. విద్యుత్ ఆపరేటర్ సంఘం మాచారెడ్డి మండల అధ్యక్షుడిగా మహేశ్, గౌరవ అధ్యక్షుడిగా నాంపల్లి, ఉపాధ్యక్షులుగా స్వామి, సెక్షన్ కార్యదర్శిగా వెంకట్, కోశాధికారిగా బాలేశం, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజేందర్, అడ్వైజర్లుగా నరేందర్, రాజిరెడ్డి తదితరులను ఎన్నుకున్నారు. ఆర్టిజన్ సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ ఏకతాటిపై రావాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కామారెడ్డి, ఆగస్టు 26 : జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో కామారెడ్డి నియోజకవర్గానికి చెందిన పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి పీజీ అడ్మిషన్లు ప్రారంభం

కామారెడ్డి, ఆగస్టు 26 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో వివిధ పీజీ కోర్సులకు మంగళవారం నుంచి అడ్మిషన్లు ప్రారంభమవుతాయని కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 విభాగాల్లో పీజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎంఏ తెలుగు, ఇంగ్లీష్, రాజనీతి శాస్త్రం, అర్థశాస్త్రం, ఎంఎస్సీ భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, వృక్షశాస్త్రం, ఫారెస్ట్రీ, ఫిషరీస్, ఎంకాం వాణిజ్య శాస్త్రం, ఎంఎస్‌డబ్ల్యూ సామాజిక అధ్యయనం వంటి కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతాయని తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు ఆన్‌లైన్ వెబ్ ఆప్షన్స్ ఉన్నట్లు తెలిపారు. మొదటి విడుత కేటాయింపు సెప్టెంబర్ 4వ తేదీన జరుగుతుందని తెలిపారు.

నేడు రైతువేదికలో 'రైతు నేస్తం'

లింగంపేట, ఆగస్టు26: మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి అనిల్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాలకు చెందిన రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వానకాలంలో రైతులు సాగు చేస్తున్న పంటల సస్యరక్షణ, చీడ పీడల నివారణ చర్యలపై శాస్త్రవేత్తలు సలహాలు, సూచనలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ఆన్‌లైన్ ద్వారా మాట్లాడుతారని తెలిపారు.

నేటి నుంచి విద్యార్థులకు క్రీడా పోటీలు ప్రారంభం

బాన్సువాడ, ఆగస్టు 26 : పట్టణంలో ఈ నెల 29న క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం నుంచి ఉన్నత పాఠశాలల విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు మినీస్టేడియం మేనేజర్ పంతులు నరేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఉన్నత పాఠశాలలకు చెందిన బాలురు వాలీబాల్‌లో 22 జట్లు, కబడ్డీలో బాలికలు 16 జట్లు పోటీల్లో తలపడనున్నాయని తెలిపారు. గెలుపొందిన జట్లకు ఈ నెల 29న బహుమతులు అందిస్తారని ఆయన తెలిపారు.

రేపు గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

లింగంపేట(తాడ్వాయి), ఆగస్టు 26: తాడ్వాయి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల కళాశాలలో ఈ నెల 28వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సురేఖ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 14, బైపీసీలో 5 సీట్లు ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు పదో తరగతి ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో సంప్రదించాలని ఆమె సూచించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

DOCUMENTS MISSING

నేను RANGARIGARI RAJU S/o. RANGARIGARI SAILU R/o.H.No.4-124/1, హన్మాజీపేట్ గ్రా॥, బాన్సువాడ మం॥, కామారెడ్డి జి॥ నా యొక్క అన్ని డాక్యుమెంట్స్ గల బ్యాగ్ ఒరిజినల్ SSC మెమో: 0874259 ఇంటర్మీడియట్ ఒరిజినల్ మెమో 0816222003 డిగ్రీ మెమో & ప్రోవిజినల్ నెం.296-09-01504, (issued by O.U) పాస్‌పోర్ట్ నెం.P3054072, డ్రైవింగ్ లైసెన్స్ No.TS21620150005105 (issued by RTA Kamareddy) గలవి. బైక్ పై దేవునిపల్లి నుండి కామారెడ్డి వైపు వెళ్ళుచుండగా ఎక్కడో పడిపోయినది. దొరికినవారు 9494140514 నెంబర్‌కు సంప్రదించగలరు.

PASSPORT LOST

★I, ALLEPU BHUMESH S/o. ALLEPU RAMULU R/o. H.No.2-108/8/L, Vill:Degaon, Mdl: Aloor, Dist.Nizamabad. నాయొక్క పాస్‌పోర్ట్ నెం.Y5321357 గలది Degaon నుండి Armoor కు బైక్ పై వెళ్ళుచుండగా మార్గమధ్యలో పడిపోయినది. ఎవరికైన దొరికినవో సం॥ సెల్: 93465 54251.
NTZ-340274

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్ 200/- మాత్రమే.
ఫోటో అదనపు లైనుకు 50/- మాత్రమే.
"పేరు మార్పిడి" ప్రకటన 4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు వంద- మాత్రమే
GST వర్తించును

అర్హులైన ప్రతిరైతుకూ రుణమాఫీ చేస్తాం

ఎల్లారెడ్డిలో నిర్మించిన డబుల్‌బెడ్ రూమ్ ఇండ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు

ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

ఎల్లారెడ్డి/ఎల్లారెడ్డి రూరల్, ఆగస్టు 26: రుణమాఫీ కాని రైతులు ఎటువంటి అనుమానాలు పెట్టుకోవద్దని, అర్హులైన ప్రతి ఒక్కరికీ రుణమాఫీ అందేలా ప్రభుత్వం కసరత్తు చేస్తున్నదని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. సోమవారం ఆయన పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. అంతకుముందు పట్టణంలో నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పరిశీలించారు. పదిహేను రోజుల్లో ఇండ్ల నిర్మాణం పూర్తి చేసి పంపిణీ చేస్తామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇండ్లు అందజేస్తామని చెప్పారు.

రుణమాఫీపై సమీక్ష

ఎల్లారెడ్డిలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు రైతురుణమాఫీపై వ్యవసాయాధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. రుణమాఫీపై వారికి అవగాహన కల్పించాలన్నారు. రుణమాఫీ కాని రైతులకు లబ్ధి చేకూరేలా చూడాలని సూచించారు. ఈ సమాశానికి ఎనిమిది మం డలాల వ్యవసాయశాఖ అధికారులు హాజరయ్యారు.

మినీ స్టేడియం కోసం స్థల పరిశీలన

గాంధారి, ఆగస్టు 26: మండల కేంద్రంలో మినీ స్టేడియం నిర్మాణం కోసం ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సోమవారం స్థానిక నాయకులతో కలిసి జువ్వాడి గ్రామ పరిసరాల్లోని ప్రభుత్వ భూమిని పరిశీలించారు. జువ్వాడి శివారులో ఏర్పాటు చేస్తే మండల కేంద్రంలోని యువకులకు దూరమవుతుందని, గాంధారి శివారులో కబ్జాకు గురైన ప్రభుత్వములు చాలా ఉన్నాయని, వాటిని స్వాధీనం చేసుకొని అందులో మినీ స్టేడియంను ఏర్పాటు చేయాలని పలువురు యువకులు ఎమ్మెల్యేకు విన్నవించారు.

గోపాల్‌పేటలో హైవే పనులు ప్రారంభం

గోపాల్‌పేటలో రహదారి విస్తరణ పనుల్లో భాగంగా చెట్లను నరికివేసిన దృశ్యం

నాగిరెడ్డిపేట, ఆగస్టు 26: మండల కేంద్రంలోని గోపాల్‌పేటలో రహదారి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చెట్లను తొలగిస్తున్నారు. గోపాల్‌పేట్ నుంచి బంజారా గ్రామం వరకు రోడ్డుకు ఇరువైపులా పెరిగిన వంద ఏండ్ల నాటి చెట్లను నరికివేశారు. మండల కేంద్రంలో రోడ్డు మధ్యలో నుంచి యాభై ఫీట్ల వరకు కొలతలు తీసి గుర్తులు ఏర్పాటు చేశారు. నాలుగు రోజుల్లో రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించస్తామని హైవే సిబ్బంది తెలిపారు.

లింగంపేటలో భారీ వర్షం

లింగంపేట, ఆగస్టు 26: మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. వానకాలం ఆరంభం నుంచి ఆశించినమేర వర్షాలు కురియక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు కురుస్తాయన్న నమ్మకంతో మండలంలోని అన్ని గ్రామాల్లో రైతులు వరి పంట సాగు చేశారు. భారీ వర్షాలు లేని కారణంగా చెరువులు నీటి నిల్వలు తగ్గుముఖం పడుతున్నాయి. సోమవారం కురిసిన వర్షం రైతులకు కాస్త ఊరటనిచ్చింది.

మండల కేంద్రంలో కురుస్తున్న వర్షం

మూడు గ్రామాల్లో ఇంటింటి సర్వే

లింగంపేట, ఆగస్టు26: మండలంలోని భవానీపేట, ముంబాజీపేట, కొండాపూర్ గ్రామాల్లో సోమవారం ఇంటింటి సర్వే నిర్వహించినట్లు మండల వైద్యాధికారిణి హిమబిందు తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న గ్రామాల్లో సర్వే చేపట్టినట్లు పేర్కొన్నారు.ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండడంతో దోమలు వృద్ధి చెంతాయని, దీంతో రోగాల బారిన పడే అవకాశం ఉందని గ్రామస్తులకు వివరించినట్లు తెలిపారు. డ్రమ్ములు, మట్టి పాత్రల్లో నిల్వ ఉన్న నీటిని పారవేసి దోమల నివారణ మందు పిచికారీ చేయించినట్లు పేర్కొన్నారు.

భవానీపేట గ్రామంలో నిల్వ ఉన్న నీటిని పారవేస్తున్న వైద్య సిబ్బంది

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కామారెడ్డి, ఆగస్టు 26 : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలోని విద్యార్థులకు స్కాలర్‌షిప్ రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వ కళాశాలలో కూడా విద్యార్థులు డబ్బులు చెల్లించి సర్టిఫికెట్స్ తీసుకెళ్తున్నారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న రూ.8 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ను విడుదల చేయాలని కోరారు. హాస్టళ్లలో కూడా నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని, మెస్‌చార్జీలు పెంచాలని అన్నారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజినీకాంత్, జిల్లా కార్యదర్శి అజయ్, ఉపాధ్యక్షుడు మణికంఠ, జిల్లా కమిటీ సభ్యులు సాయి, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలి

కామారెడ్డి రూరల్, ఆగస్టు 26 : ప్రతి ఒక్కరూ మొక్కలను తప్పకుండా నాటాలని రోటరీ క్లబ్ అధ్యక్షుడు రాజనర్సింహారెడ్డి అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా కామారెడ్డిలో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మొక్కల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో కార్యదర్శి సత్యనారాయణ, ట్రెజరర్ సబ్బని కృష్ణహరి, సత్యం, సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

భిక్కనూరు, ఆగస్టు 26: భూవివాదంలో ఇద్దరిపై కేసు నమోదుచేసినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన శ్రీకాంతం సిద్ధరాంలు స్థానిక బస్టాండ్ వద్ద సర్వే నంబర్ 1172లో 14 గుంటల భూమిలో ఏర్పాటు చేసిన ప్లాట్ల విషయమై వివాదం నెలకొనగా..దీనిపై కొందరు కోర్టును ఆశ్రయించారు. భూమి విషయమై శ్రీకాంతం సిద్ధరాంలు, అదే గ్రామానికి చెందిన కటికె లక్ష్మీబాయి మధ్య వివాదం నెలకొనడంతో ఇద్దరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇరువురిపై కేసు నమోదుచేసినట్లు ఎస్సై తెలిపారు.

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

మోర్తాడ్, ఆగస్టు 26 : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. ప్రాజెక్ట్‌లోకి 24,073 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతున్నది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా, సోమవారం ప్రాజెక్ట్‌లో 1084.2 అడుగుల (57.316 టీఎంసీలు) నీరు నిల్వ ఉన్నది. ప్రాజెక్ట్ నుంచి 3,822 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో కొనసాగుతున్నది. మూడు వేల క్యూసెక్కులు కాకతీయ కాలువకు, 50 క్యూసెక్కులు లక్ష్మీకాలువకు, 231 క్యూసెక్కులు మిషన్ భగీరథకు విడుదల చేస్తుండగా, 541 క్యూసెక్కుల నీరు ఆవిరిగా వెళ్తున్నది.